అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 13 జూన్ 2023

వేతనాలు చెల్లించాలని ఔట్సోర్సింగ్ సిబ్బంది ఆందోళన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు బహిష్కరించి పరిపాలన భవనం ముందు ధర్నా నిర్వహించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజులు గడుస్తున్నా ఇంతవరకు తమకు వేతనాలు ఇవ్వలేదని, వైస్ ఛాన్సలర్ నిర్లక్ష్యం వల్లనే తమకు వేతనాలు రావడం లేదనివారన్నారు. ఎస్బీఐ బ్యాంకు అధికారులకు వైస్ ఛాన్సలర్ కు ఫోన్ చేసి జీతాలు నిలుపుదల చేశారని సిబ్బంది ఆరోపించారు. గత రెండు నెలలుగా యూనివర్సిటీలో వైస్ ఛాన్సలర్, పాలక మండలి సభ్యుల గొడవలతో తమకు ప్రతినెలా వేతనాల రాక ఇబ్బందులు ఎదురౌతున్నయని వారు పేర్కొన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా వైస్‌ఛాన్సలర్ యూనివర్సిటీకి రావడం మానేశారని, తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు.

నవీపేట్‌లో రైల్వే గేటును ఢీకొన్న వాహనం

నవతెలంగాణ-నవీపేట్


విరిగిపడ్డ గేటు

మండల కేంద్రంలోని రైల్వే గేటును సోమవారం ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గేటు పూర్తిగా విరిగిపోయింది. దీంతో బాసర, నిజామాబాద్ వైపు వెళ్ళు వాహనాలు కిలోమీటర్ మేర నిలిచిపోయాయి. సమాచారం మేరకు రైల్వే ఆర్పిఎఫ్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి వచ్చి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వాహనం రైల్వే గేటును ఢీ కొట్టి పరారైనట్లు తెలిపారు. రైల్వే గేటుకు రైల్వే సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఆయన వెంట రైల్వే పోలీస్ సుధీర్ సింగ్ తదితరులు ఉన్నారు.

రైతుబంధు రాకపాయే

- అప్పు చేస్తూ సాగుకు సన్నద్ధమవుతున్న రైతు
- దశాబ్ది వేడుకల్లో పాలకులు, అధికారులు బిజీ
- సకాలంలో అందజేస్తే మేలు అంటున్న రైతులు

నవతెలంగాణ-మద్నూర్



ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. నైరుతి రుతుపవణాలు ఆలస్యం కావడంతో వర్షాలు కురియగానే సాగు పనులు చేపట్టేలా పలువురు రైతులు సిద్ధమవుతున్నారు. విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలుకు డబ్బులు లేక పలువురు రైతులు అప్పులు చేస్తున్నారు. సీజన్ ప్రారంభం కంటే ముందే ప్రతిసారీ రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు విడుదల చేస్తుండటంతో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే బాధ తప్పినప్పటికీ.. ఈ సీజన్‌లో ఇంకా రైతు బంధుపై ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఖరీఫ్ పంటల సాగు ఆసన్నమైనందున రైతన్న ఎరువులు విత్తనాలు అప్పులతో కొనుగోలు చేస్తూ సాగు కోసం సిద్ధమవుతున్నారు. మద్నూర్ ఉమ్మడి మండలంలో మద్నూర్ డోంగ్లి మండలాల పరిధిలో ఖరీఫ్ సాగులో భాగంగా సోయా పంటను రైతులు అత్యధికంగా సాగు చేస్తారు. జూన్ రెండో వారం కొనసాగుతున్నందున ఖరీఫ్ సాగు ఆసన్నమైందని చినుకు పడితే విత్తు అలుకడానికి రైతన్నలు అప్పులు చేస్తూ సోయా విత్తనాలు ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతన్న అప్పులు చేసుకోకుండా పెట్టుబడి సహాయం కింద రైతుబంధు పథకాన్ని అమలు పరుస్తూ ఎకరాకు ఖరీఫ్ సాగుకు 5000 రూపాయల చొప్పున ఆ తర్వాత రబీ పంట సాగు ఎకరాకు 5000 రూపాయలు చొప్పున మొత్తం రెండు విడతల్లో ఎకరాకు పదివేల రూపాయలు పెట్టుబడి సాయం అందిస్తూ వచ్చింది. అయితే ఈసారి పెట్టుబడి కోసం రైతన్న అప్పులు చేయక తప్పడం లేదు. ఎందుకంటే జూన్ మొదటి వారం నుండి వర్షాలు పడగానే పంట సాగు చేస్తారు. ప్రస్తుతం జూన్ రెండో వారం కొనసాగుతోంది. వర్షం పడగానే పంట సాగు ప్రారంభిస్తారు.

మద్నూర్ ఉమ్మడి మండలంలో మొత్తం సుమారు 22 వేల మంది రైతులు ఉన్నారు. ఈ రైతులకు ఖరీఫ్ పెట్టుబడి సహాయం కింద దాదాపు 25 కోట్లు అవసరంగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం జూన్ మొదటి వారంలో పెట్టుబడి సహాయం అందిస్తే గాని రైతన్న అప్పులు చెయ్యకుండా ఉండగలడు. ప్రస్తుతం జూన్ రెండో వారం గడుస్తున్నా ప్రభుత్వ పెట్టుబడి సహాయం అందకపోవడంతో అప్పుల కోసం పరుగులు తీస్తూ రైతన్న ఎరువులు విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వానాకాలం పంట సాగు కోసం జూన్ మొదటి వారంలోని పెట్టుబడి సహాయం అందిస్తే రైతులకు అప్పులు తప్పుతాయి. రెండో వారం గడిచిన పెట్టుబడి సహాయం కోసం రైతన్న ప్రభుత్వం వైపు ఎదురు చూస్తున్నారు.

విత్తనాలు ఎరువులు లభిస్తాయో లేదో మార్కెట్లో రోజురోజుకు ధరలు ఏ విధంగా పెరుగుతాయోనని అయోమయంలో రైతన్న అప్పులు చేయక తప్పడం లేదు. రాత్రి వర్షం కురిస్తే ఉదయమే పంట సాగు కోసం రైతన్న సిద్ధం అయ్యారు. ప్రభుత్వం అందించే పెట్టుబడి సహాయం మాత్రం ఇప్పటికీ ఎప్పుడు వస్తుందో తెలియదు. ఈ విషయాన్ని కూడా వ్యవసాయ అధికారులకు అడిగి తెలుసుకున్న పెట్టుబడి సహాయం అందించే టైం బాండ్ ఇంకా ప్రభుత్వం నుండి రాలేదని తెలుస్తోంది. ఈనెల 22 వరకు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ పనిలోనే బిజీగా ఉంది. రైతు పెట్టుబడి సహాయానికి డబ్బులు ఎప్పుడు విడుదల చేస్తుందో అవి రైతన్న ఖాతాల్లో ఎప్పుడు జమవుతాయో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా పాలకులు స్పందించి సకాలంలో రైతుబంధు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మోగిన బడిగంట

- స్కూళ్లు పున:ప్రారంభం.. బుక్‌స్టాళ్ల వద్ద పుస్తకాల జాతర


బుక్‌స్టాల్ వద్ద బుక్కుల కొనుగోలుకు తరలివచ్చిన తల్లిదండ్రులు



నవతెలంగాణ-తాడ్వాయి/నిజామాబాద్‌సిటీ

వేసవి సెలవులు ముగించుకుని సోమవారం పాఠశాలలు పున:ప్రారంభ మైయ్యాయి. దీంతో తొలిరోజు పిల్లలు ఉత్సాహంతో స్కూల్‌కు వెళ్లారు. కొత్త తరగతి గదులు, కొత్త బ్యాగులు, కొత్త పుస్తకాలు, పై తరగతి అంటూ సంబురపడ్డారు. స్కూళ్ల ప్రారంభం కాగా.. పుస్తకాలు, నోట్‌బుక్కులు కొనుగోలుతో బుక్‌స్టాళ్లు కిటకిటలాడుతున్నాయి.

ఇంటి నుంచే భోజనం

తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కరువైంది. విద్యార్థులు ఇంటి నుంచే భోజనం తెచ్చుకుని తిన్నారు. ఈ విషయమై స్కూల్ హెచ్ఎంను నవతెలంగాణ ఆరా తీయగా మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రాలేవని, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. భోజనం పెడుతున్న కార్మికులకు డబ్బులు ఇవ్వకపోతే.. వారు ఎలా తెచ్చి భోజనం పెడతారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పౌష్టికా హారంతో పెడుతున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. కార్మికులకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల బిల్లులు క్లియర్ చేసి మధ్యాహ్నం భోజనం పెట్టేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


తాడ్వాయి: కృష్ణాజివాడిలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం


సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం రీతకరుల, నిర్మలనేగి సోమవారం సందర్శించారు. ల్యాబరేటరి, లేబర్ గది, ఫార్మసీ, ఇన్ పేషంట్స్ , ఔట్ పేషంట్స్ విభాగాలను పరిశీలించారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి డాక్టర్ ఆస్మా ఆఫ్రిన్‌ను పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గైని అనుసూయ, జడ్పీటిసి కమిలి నర్సింలు, స్థానిక సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి బీరయ్య, మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ వడ్ల రాజేందర్, సిఎచ్ఓ నాగరాజు, ఎ.ఎన్‌యంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషిచేస్తాం

- జర్నలిస్ట్ కమ్యూనిటీ హాల్‌కు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శంకుస్థాపన


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తా అని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. జర్నలిస్టుల సొంతింటి కల సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. ఇళ్ల స్థలాలతో పాటు విద్యా వైద్యం వంటి రంగాల్లో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. మాక్లూర్ మండలం బొర్గం (కె) శివారులో జర్నలిస్టుల కోసం ప్రెస్ భవన్ కమ్యూనిటీ హాల్‌కు జీవన్ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. రూ.50 లక్షల నిధులతో భవన నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని చెప్పారు. తెలంగాణ పోరాట స్ఫూర్తిని రగిల్చిన జర్నలిస్టులను గుర్తించడంలో కొంత ఆలస్య మైందని ఆయన అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం శ్రమిస్తున్న మీడియా ప్రతినిధులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్ రావు, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, రాజలింగం, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పీజీటీ, టీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో పీజీటీ, టీజీటీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ భానుమతి తెలిపారు. పిజిటి జువాలజీ, బోటనీ ఇంగ్లీష్, తెలుగు 2 టీజీటీ హిందీ, తెలుగు పోస్టులకు పీజీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళ, బుధ వారాలలో డెమో ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెకలిపారు. వీరికి వేతనం నెలకు 18 వేల రూపాయలు చెల్లించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అంగన్‌వాడీలను రక్షించుకుందాం

- 19న అంగన్‌వాడీల జీపు జాత, బహిరంగ సభను జయప్రదం చేయండి : సీఐటీయూ

నవతెలంగాణ-మద్నూర్


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఐసీడీఎస్‌కు బడ్జెట్ కుదించి అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఐసిడిఎస్ కు బడ్జెట్‌ను పెంచి, ఐసిడిఎస్ కు ప్రమాదక రమైన 2020 నూతన జాతీయ విద్య విధానం చట్టాన్ని రద్దు చేయాలని తదితర డిమాండ్‌లో అంగవాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన తలపెట్టిన జీపు జాత, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.

19న చేపట్టే కార్యక్రమంపై సోమవారం బాన్సువాడలో జీపు జాత వాల్‌పోస్టర్ ఆవిష్కరించి అనంతరం మద్నూర్, బాన్సువాడ ప్రాజెక్ట్ సిడిపిఓల కు అనుమతి కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సురేష్ గొండ మాట్లాడుతూ 45వ ఐఎల్ఎస్ సిఫారసులు అమలు చెయ్యాలని అంగన్వాడీ టీచర్లందరికి కనీస వేతనం 26వేలు చెల్లిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 19న బాన్సువాడలో అంగన్‌వాడీల జీపు జాత కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 4 గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టే బహిరంగ సభలో మద్నూర్, బాన్స్‌వాడ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లందరు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని తెలంగాణ కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చెయ్యకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలంగాణ రాష్ట్రంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు దాటినా ఏ ఒక్క ఖాళీ పోస్ట్ ను భర్తీ చెయ్యలేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాలని ఎండగట్టేందుకు, సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరు ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు జరిగే దేశవ్యాప్త పోరాటంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మహాదేవి, కార్యదర్శి రాధ, సావిత, వాజ్రా విజయలక్ష్మి, బాలమణి, సి ఐ టి యు జిల్లా నాయకులు జె. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ పాటిల్

ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ నాటికి 18 ఏళ్ళు నిండే యువతి, యువకులు ఓటు హక్కు కోసం బిఎల్వో లకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో ఓటర్ల జాబితాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో వారానికి ఒకసారి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇంటింటికి బిఎల్వోలు వెళ్లి ఓటర్ల జాబితాలో పేర్లు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. తప్పులు ఉంటే దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు.

మృతి చెందిన వ్యక్తుల పేర్లు ఉంటే తొలగించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరం లోపు ఉండే విధంగా చూడాలన్నారు. ఒక వ్యక్తి పేరు ఓటర్ల జాబితాలో ఒకే చోట ఉండే విధంగా చూడాలని పేర్కొన్నారు. రెండు చోట్ల ఉంటే ఒకచోట తొలగించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవోలు శ్రీనివాస్ రెడ్డి, శీను, రాజా గౌడ్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఎల్లలు దాటిన ప్రేమ

- సాలూర అబ్బాయి, ఇండోనేషియా అమ్మాయికి వివాహం

నవతెలంగాణ-బోధన్



సాలూర మండల కేంద్రానికి చెందిన గోనే సావిత్రి - గంగాధర్‌ల మూడవ కుమారుడు నీలకంఠం ఇండోనే షియా దేశానికి చెందిన హర్లన్ ఆంథోనీ - బీక్రీస్ అంథోనిల రెండవ కుమార్తె డీజెన్ దెబోరతో సోమవారం బోధన్ పట్టణంలోని పెండ్లి అంగరంగ వైభవంగా వివాహం జరిగింది. ఇండోనేషియా దేశం నుండి అమ్మాయి(వధువు) తరఫున కుటుంబ సభ్యులు వారం రోజుల క్రితం సాలూర గ్రామానికి వచ్చి హిందూ సంప్రదాయం ప్రకారం పెద్దల సమక్షంలో వివాహం నిశ్చయించుకున్నారు. వధూవరులు ఇజ్రాయిల్ దేశంలో పీహెచ్.డీ చదువుకునే సమయంలో ఒకరికొకరు పరిచయం పెంచుకొని స్నేహితులుగా ఉంటూ ఇద్దరు ఇష్టపడడంతో పెళ్లికూతురు పెళ్లి కొడుకు వారి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో పెద్దల ఇష్ట ప్రకారం పెళ్లి చేసినట్టు కుటుంబీకులు తెలిపారు. వీరిని గ్రామ పెద్దలు బుద్దె రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాలురా షకీల్, ఎంపీటీసీ కండెల సవిత సంజీవ్, అల్లె రమేష్, సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్, బాసర శివకాంత్, గంటే వీరేశం, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ నబి, తదితరులు ఆశీర్వదించారు.

అర్సపల్లి రైల్వే గేట్ మెన్‌పై దాడి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

రైలు వస్తుండటంతో గేటు వేస్తుండగా.. అలాగే ముందుకు రావడంతో కారుపై కొద్దిగా గేట్ పడటంతో కారులోని వ్యక్తులు గేట్‌మెన్‌పై దాడి చేశారు. ఈ ఘటన అర్సపల్లి రైల్వేగేట్ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే సిగ్నల్ సమయం ప్రకారం గేట్ వేయబోతుండగా.. ఓ కారు వచ్చిందని, వెనకకు తీయమన్నా తీయకపోవడంతో గేటు వేసే క్రమంలో కొద్దిగా కార్ మీద గేట్ పడటంతో ఇష్టం వచ్చినట్టు కొట్టినట్టు బాధిత గేట్‌మెన్ సురేష్ వాపోయాడు. ఇష్టం వచ్చినట్టు కొడుతూ దుర్భాషలాడుతూ.. తాను ఎమ్మెల్యే మనిషిని అంటూ బెదిరించి కొట్టినట్టు తెలిపారు. డయల్ 100కు ఫోన్ చేసి కంప్లైంట్ ఇచ్చినట్టు తెలిపారు. గతంలో సైతం ఇదే విధంగా దాడి చేసిన ఎస్ఐ కొడుకు అని కేసు నమోదు చేయలేదని, మరోసారి కార్పొరేటర్ మధ్యలో వచ్చి కేసు చేయకుండా చేశారని, ఈసారి సైతం కేసు కాకుండా చూస్తారేమో అని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు భద్రత లేదని వాపోయాడు. ఈసారైనా నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా 2కే రన్


2కే రన్‌లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లాలో నియోజకవర్గ కేంద్రాలలో సోమవారం నిర్వహించిన 2కె రన్ కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా కేంద్రంలో నగర నడిబొడ్డున గల పులాంగ్ చౌరస్తా నుండి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన మార్గాల మీదుగా పోలీస్ పరేడ్ మైదానం వరకు కొనసాగింది. స్వరాష్ట్రంలో తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతి, విశిష్టతలను చాటేలా ఉదయం 7 గంటల సమయానికే వేలాది సంఖ్యలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా హాజరై 2కె రన్ లో భాగస్వాములయ్యారు. జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ తోడ్పాటుతో జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ పరుగులో ఉద్యోగులు, విద్యార్థులు, యువతీ, యువకులు మొదలు వృద్ధుల వరకు కదంకదం కలుపుతూ ఉత్సాహంగా పాల్గొనడం సమైక్యతకు అద్దంపట్టింది. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా రూపొందించి సమకూర్చిన శ్వేతవర్ణపు టీ షర్టులను ధరించి వేలాది మంది 2కె రన్ లో పాల్గొన్నారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బెలూన్లను గాలిలోకి ఎగురవేసి, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠలావు, నగర మేయర్ దండు నీతు కిరణ్, అదనపు డీసీపీలు మధుసూదన్ రావు, గిరిరాజ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ తదితరులంతా 2 కె రన్ లో భాగస్వాములయ్యారు. వీరితో పాటు అన్ని శాఖలకు చెందిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు, ఎన్ సి సి, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, నర్సింగ్ కళాశాల, ఇతర విద్యా సంస్థలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు, వైద్యులు, క్రీడా సంఘాల బాధ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దశాబ్ది ఉత్సవ జెండాలను చేతబూని నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఫ్రీడమ్ ర్యాలీకి హాజరైన వారితో పోలీస్ పరేడ్ మైదానం కిక్కిరిసిపోయింది. 2కె రన్ ను ప్రారంభించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా రంగాలలో తెలంగాణ సాధించిన ప్రగతిని గుర్తు చేసుకుంటూ మరింత ఉత్సాహంగా ముందుకు సాగేలా ప్రభుత్వం అట్టహాసంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందని అన్నారు. ఇందులో భాగంగా చేపట్టిన 2కె రన్‌కు యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలిరావడం ఎంతో సంతోషకరమని అన్నారు. దశాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో రాష్ట్ర ప్రగతిలో మరింతగా మమేకం అవుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి పదో తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు

- డీఈవో దుర్గాప్రసాద్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పదవతరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 14 నుంచి నిర్వహించనున్నట్టు డీఈఓ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మొత్తం 12 పరీక్ష కేంద్రాలలో అన్నీ సెంటర్లలో సీసీ కెమెరాలు అమార్చారని, పరీక్షకు హాజరగు విద్యార్థులు, పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందే చేరుకోవాలని సూచించారు. ఎవరైనా మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే విద్యార్థితో పాటు ఇన్విజిలేటర్, శిక్షార్హులు అని, పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు నిషేధమని తెలిపారు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ఏవి పరీక్ష కేంద్రానికి తీసుకురావడానికి వీలులేదని పేర్కొన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే కంట్రోల్ నెంబర్ 9030282993కు ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ఆర్థికసాయం



నవతెలంగాణ-ఆర్మూర్

డొంకేశ్వర్ మండలంలోని దత్తాపూర్ గ్రామానికి చెందిన మూడ్ లావణ్య కిక్ బాక్సింగ్‌లో తెలంగాణలోనే మొట్టమొదటి గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా సన్మానం చేసి రూ.10వేల నగదును ఫౌండేషన్ డైరెక్టర్ సుచరితరెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సుచరితరెడ్డి మాట్లాడుతూ.. లింగ బేధం లేకుండా తల్లిదండ్రులు పిల్లలకు ఇష్టమైన రంగాల్లో ఉండేలా పోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో రాము, నారాయణ, సంతోష్ రెడ్డి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు అండగా కేసీఆర్

- ఎన్నికల మేనిఫెస్టోలో లేని ఎన్నో పథకాలను ప్రవేశపెట్టినం
- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- వందేండ్లలో లేని అభివృద్ధి 10 ఏండ్లలో చేశాం..
- రూరల్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- పోలీసుశాఖ ఆధ్వర్యంలో పలుచోట్ల 2కే రన్
- భారీగా పాల్గొన్న పలు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు



డిచ్‌పల్లి : 2కే రన్‌ను ప్రారంభిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-విలేకరుల బృందం

డిచ్‌పల్లి : వికలాంగులకు అండగా సీఎం కేసీఆర్ నిలుస్తున్నారని, ఇటీవలే రూ.1000 పింఛన్ పెంచారని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో లేని ఎన్నో పథకాలను ప్రవేశపెట్టినామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 2కే రన్ ను డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు ఏడవ బెటాలియన్ నాగపూర్ గేట్ నుంచి కేఎస్‌అర్ గార్డెన్ వరకు 2కే రన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా యువ నాయకులు, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్, ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, బెటాలియన్ కమాండెంట్ సత్య శ్రీనివాస్ రావు, నిజామాబాద్ డివిజన్ ఆర్డీఓ రవితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు 11 రోజులుగా పండగల జరుపుకుంటున్నామని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తూ కేసీఆర్ బంగారు తెలంగాణ చేస్తున్నాడని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో లేని ఎన్నో పథకాలను కేసీఆర్ ప్రవేశపెట్టి అన్ని వర్గాల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో గురుకులను ఏర్పాటు చేసి 60 లక్షల విద్యార్థులకు సంవత్సరానికి ఒక్క విద్యార్థిపై 1.20 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. వికలాంగులకు వేయి రూపాయలు అదనంగా పెంచడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన నియోజకవర్గం 5వేళ మంది వికలాంగులు లబ్దిపొందుతున్నారని వెల్లడించారు. ప్రతిపక్షాలు ఏం హామీతో ప్రజల్లోకి రావాలో అర్థం కాని పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందని పేర్కొన్నారు. ఆరోగ్య తెలంగాణ కోసం పట్టణ, పల్లె క్రీడా మైదాలను ఏర్పాటు చేసి యువకులు శారీరకంగా, మానసికంగా పటిష్ఠం చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, సొసైటీ డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, పార్టీ సీనియర్ నాయకులు, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, పోలీసులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : తెలంగాణలో గడిచిన వందేళ్లలో జరగని అభివృద్ధిని కేవలం పదేండ్లలోనే చేసి చూపించామని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహించిన 2-కే రన్ కార్యక్రమంలో జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో హాజరైన 2-కే రన్ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లు అని పేర్కొన్నారు. ఎవరైనా దశాబ్ది ఉత్సవాలను విమర్శిస్తే ఊరుకునేది లేదని, అభివృద్ధి నిరోధకులకు గట్టి బుద్ధి చెప్పి తీరుతామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ప్రజలను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తెలంగాణను శత్రువుగా చూస్తోందని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. నలుగురు బీజేపీ ఎంపీలు రాష్ట్రాభివృద్ధిని విస్మరించారని ఆయన మండిపడ్డారు. కేంద్రం సహకరించకపోయినా అభివృద్ధిలో తెలంగాణ నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపు వల్లే అద్భుత ఫలితాలు వచ్చి నేడు తెలంగాణ మోడల్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. "చేసిన మంచి పనులు చెప్పుకుంటే తప్పా?. వేదిక ఏదైనా తాను అభివృద్ధి, సంక్షేమం గురించే మాట్లాడుతా. ఆర్మూర్ అభివృద్ధిపై ప్రజల్లో చర్చ జరగాలి. నేను నిరంతరం నియోజకవర్గ అభివృద్ధికే పాటుపడుతున్నా. నేను తెచ్చిన పథకాలు చెబితే రామాయణమంత. ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధిని గతంలో ఎప్పుడూ చూడలేదు. రూ.3000 కోట్లతో ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా. ఆర్మూర్ రెవెన్యు డివిజన్, ఆలూర్, డొంకేశ్వర్ కొత్త మండలాలు, అంబేద్కర్ చౌరస్తాను సుందరీకరణ ఇలా ఎన్నో పనులు చేపట్టామని తెలిపారు. తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలే మళ్ళీ గెలిపిస్తాయన్నారు. ప్రజలంతా అభివృద్ధి వైపే నిలబడాలని జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినితా పవన్, వైస్ చైర్మన్ మున్నభాయ్, జడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ పస్క నర్సయ్య, ఎంఈఓ రాజ గంగారం, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎస్ఐలు రాము, శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు, కౌన్సిలర్లు ఇట్టెడి నర్సారెడ్డి రవిగౌడ్, ఆలూరు, పిప్రి దేగాం ఉప సర్పంచులు దమ్మాజీ శ్రీనివాస్, ఆశాపురం దేవి, శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం సరోజ గంగారెడ్డి, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, పోలీసు అధికారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ : 2కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

బోధన్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో 2కే రన్ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు ఈ 2కే రన్ కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్డీవో రాజేశ్వర్, ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత రాష్ట్రం నేర రహితంగా మారిందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేర రహిత సమాజం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మావతి, జడ్పీ వైస్ చైర్మన్ రజితా యాదవ్, ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ సతీమణి ఆయేషా ఫాతిమా, పట్టణ సీఐ ప్రేమ్ కుమార్, రూరల్ సీఐ శ్రీనివాసరాజ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, పట్టణ ప్రముఖులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

2కే రన్‌కు తరలివెళ్లిన నాయకులు, యువకులు..

కమ్మర్‌పల్లి : తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భీంగల్ మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌లో పాల్గొనేందుకు మండలం నుంచి పలువురు అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, యువకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. భీంగల్‌లో తరలివెళ్లిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాలావత్ ప్రకాష్, సర్పంచ్‌లు పెండే ప్రభాకర్, పుప్పల గంగాధర్, గుగులోతు భాస్కర్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కాలేరు శేఖర్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, ఐకేపీ ఏపీఎం కుంట గంగారెడ్డి, నాయకులు ఇంద్రాల రాజేందర్, పేరం లింబాద్రి, బందెల రాజు, సక్కారం శ్రీనివాస్, దివాకర్, సౌమిత్, మునిందర్, రాజశేకర్, తదితరులున్నారు.

నిజామాబాద్‌రూరల్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా 2కే రన్‌లో నిజామాబాద్ మండలాధ్యక్షుడు మీసాల మధుకర్ రావు, మల్లారం వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మల్లారం సర్పంచ్ చింత కింది నాగేష్, సారంగాపూర్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అక్బర్ నవాజుద్దీన్, నిజామాబాద్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ : రూరల్ నియోజకవర్గంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డిచ్‌పల్లి మండల కేంద్రంలో నాగపూర్ గేట్ నుంచి కేఎస్‌ఆర్ గార్డెన్ వరకు టు కే రన్ నిర్వహించారు.

దానిలో భాగంగా రూరల్ ఎంఎల్‌ఏ, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశానుసారం మోపాల్ మండలానికి చెందిన అధికారులు, నాయకులు పాల్గొ న్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, ఎంపీడీఓ లింగం నాయక్, డిప్యూటీ తహసీల్దార్ మునీరోద్దీన్, జెడ్పీటీసీ కమల నరేష్, ఎంపీపీ లతా కన్నీరాం, మండల అధ్యక్షుడు మొచ్చ శ్రీనివాస్, సర్పంచులు సిద్ధార్థ, ముత్యంరెడ్డి, సాయిరెడ్డి, శ్రావణ్, కొల గంగాధర్, క్యాతం రవి, బుషన్, ఎంపీటీసీలు రమేష్, సంగ్యనాయక్, ముట్టెన్న తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో రన్‌లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



నిజామాబాద్ రూరల్‌లో

ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి



ఏర్గట్ల : మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల/కంఠేశ్వర్

ఈ నెల 18న నిర్వహించబోయే రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ పోటీల్లో 16 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు యువత పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని దోంచంద గ్రామంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా, తెలంగాణ యువశక్తిని మేల్కొలిపే దిశగా క్విజ్ పోటీలు జరుపుతున్నామని, ఇందులో గెలుపొందిన వారికి నియోజకవర్గానికి ఒక స్కూటీ, 40 ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్టు వివరించారు. ఆసక్తి గల యువత జూన్ 17లోగా 7661899899కు మిస్ కాల్ ఇచ్చి తర్వాత వచ్చిన లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6లోపు ఆన్లైన్ పరీక్ష ఉంటుందని, ఇందులో 60 ప్రశ్నలకు 60 నిమిషాల వ్యవధి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమా దేవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు ముస్కు మోహన్ రెడ్డి, వెంకయ్యగారి రవి, వెంకటొరెడ్డి, కొరిపెల్లి లింగారెడ్డి, మునీరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంపిటీషన్ కోసం దరఖాస్తు చేసుకోండి..

కంఠేశ్వర్ : సంచలనాత్మక హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొల్పే దిశగా జూన్ 18న నిర్వహించే రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ కోసం నిజామాబాద్ జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల యువతీ, యువకులు, విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎన్.ఎస్.యు.ఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ పిలుపునిచ్చారు. సోమవారం గూపన్‌పల్లిలోని కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(కిట్స్) (ఉమెన్స్) కళాశాలలోని విద్యార్థులను కలిసి రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌కు సంబంధించి వివరాలను తెలియజేసి, విద్యార్థులతో ఆన్లైన్ క్విజ్ రిజిస్ట్రేషన్ చేయించారు.

శ్రీభాషితలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ



లోగోను ఆవిష్కరిస్తున్న ప్రముఖ పాత్రికేయుడు గౌతమ్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలలో 'కమ్యూనికేషన్ స్కిల్స్, న్యూస్ ప్రెజెంటేషన్‌పై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా న్యూస్ ఛానల్ ప్రారంభోత్సవం లోగోను సోమవారం ఆవిష్కరించారు. ప్రముఖ పాత్రికేయులు, న్యూస్ రీడర్ శ్రీ గౌతమ్ శ్రీ భాషిత న్యూస్ ఛానల్, లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, న్యూస్ ప్రజెంటేషన్‌పై కార్యశాల నిర్వహించి, ప్రారంభమైన నూతన విద్యా సంవత్సరాన్ని అధికారికంగా ప్రారంభించారు. అంతేకాకుండా ఉపాధ్యాయులకు మాట్లాడడంలో ఉన్న మెలకువలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ భాషిత పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో ప్రతి ఒక్కరికి కావలసింది కమ్యూనికేషన్ స్కిల్స్ అని, ఈ కమ్యూనికేషన్స్ స్కిల్స్ విద్యార్థులు అభివృద్ధి పరచుకోవడానికి ప్రముఖ న్యూస్ ప్రెజెంటర్ టి. గౌతమ్‌చే కార్యశాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేల ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఇమ్మడి గోపి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన నూతన శివాలయం నిర్మాణానికి తనవంతుగా 50వేల రూపాయలను ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇమ్మడి గోపి ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్మడి గోపి మాట్లాడుతూ.. తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన యువకులు గల్ఫ్‌లో ఉండి డబ్బులను పోగుచేసుకుని లక్షలాది రూపాయలు అలయ నిర్మాణానికి పంపించడం అభినందనీయమన్నారు. ఇదే కాకుండా గ్రామస్తులు, ఇతరులు తమకు తోచిన విధంగా సహాయం అందజేస్తున్నారని గ్రామ యువకులు, వీడీసీ సభ్యులు కలిసి విన్నవించిన వెంటనే ఆలయం వద్దకు వచ్చి పనులు చూసి తనవంతుగా రూ.50వేలు అందజేసినట్లు ఇమ్మడి గోపి వివరించారు. సహయం అందజేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొల్ల మోహన్, తెడ్డు మహేందర్, కుమ్మరి పెద్ద గంగారాం, శెట్టి మల్లేష్, గొల్ల ప్రసాద్, నడ్పి మల్లేష్, దొడ్ల గంగారం, పాల్దే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

- అఖిల భారత రైతు కూలీ సంఘం

నవతెలంగాణ-బోధన్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతుల సమస్యలను ప్రభుత్వం తక్ష ణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం అఖిల భారత రైతు కూలీ సంఘం బోధన్ ఉమ్మడి మండల కమిటీ ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో కార్యాలయ అధికారి ముంతాజుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం రైతు కూలీ సంఘం బోధన్ మండల అధ్యక్ష కార్యదర్శులు దార్నె భూమన్న, గంపల పోశెట్టి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం లక్ష లోపు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వానాకాలం వ్యవసాయ సీజన్ మొదలైనందున కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు పెద్ద ఎత్తున రైతులకు వ్యాపారస్తులు అమ్ముతున్నందున వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్చి నుంచి మే వరకు కురిసిన అకాల వర్షాలకు, వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలకు తక్షణమే నష్టపరిహారం అందజేయాలని కోరారు. వరి ఇతర పంటలకు కొనుగోలు చేసిన దానికి డబ్బులు రైతుల ఖాతాలో నేటికీ జమ చేయలేదని దాంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ధాన్యం కొనుగోలు డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు వ్యవసాయ పరికరాలు 75శాతం సబ్సిడీతో అందజేయాలని, ఫసల్ బీమా పథకం రాష్ట్రంలో అమలు చేయాలని, పాత రుణాలు రద్దుచేసి 100శాతం పంటలకు కొత్త రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి పి.వరదయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ బోధన్ మండల ఉపాధ్యక్షులు దేవదాస్, జిల్లా నాయకులు షేక్ నజీర్, మండల నాయకులు గంగారం, సాయిలు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ఉన్నారు.

ప్రజల ఆకాంక్షల అమలు కోసం

సర్కారుపై పోరాడుదాం

- సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న వనమాల కృష్ణ

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూన్ 12న 'తెలంగాణ దీక్షా దివస్' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహించాలన్న సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ.. ఏ ప్రజాస్వామిక ఆకాంక్షలతో నిలువెత్తు ఉద్యమం నిర్మించి వందలాది మంది బలిదానాలు చేశారో, ఆ ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల అమలు కోసం కేసీఆర్ సర్కారుపై పోరాడుదామని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగం అనే పదమే ఉండదన్న నినాదంపై ఎంతో ఆశలు పెంచుకున్నారన్నారు. రైతు రుణాలు రద్దవుతాయని, రేషన్ కార్డులు, ఇండ్లు, ఇంటి స్థలాలు, పెన్షన్లు, అర్హులైన వారందరికీ వస్తాయని ఆశపడ్డారన్నారు. అయినా రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానాలు అమలు పరచలేదన్నారు. పరిపాలన కేంద్రీకృతంగా, ఏకపక్షంగా సాగుతున్నదన్నారు. అవినీతి పెరిగిందన్నారు. బయట శక్తుల ప్రాబల్యమే కొనసాగుతున్నదన్నారు. ప్రజాస్వామిక హక్కులు హరించబడుతున్నాయన్నారు. ఈ విధానాలు, పరిణామాలు తెలంగాణ రాష్ట్రానికి అత్యంత నష్టకరమైనవన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని, ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా డిమాండ్ చేస్తుందన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, రెగ్యులరైజ్ చేయాలన్నారు. టీఎస్పీఎస్సీని తక్షణమే ప్రక్షాళన చేసి, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు ఇవ్వాలన్నారు. ధరణి వెబ్‌సైట్ అవకతవకలను వెంటనే సరిచేయాలన్నారు. నిరుద్యోగ భృతి అమలు చేయాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన ఉచిత విద్యా వైద్యం అందివ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్, పి.రామకృష్ణ, జిల్లా సెక్రటేరియట్ నాయకులు ఎం.వెంకన్న బి.దేవారం, డి.రాజేశ్వర్, నగర కార్యదర్శి ఎం.సుధా కర్, జిల్లా నాయకులు కే.గంగాధర్, ఎం.ముత్తెన్న, బి.మల్లేష్, సాయగౌడ్, సురేష్ వివిధ ప్రజాసంఘాల బాధ్యులు కిషన్, గంగాధర్, కిషన్, సత్యక్క, గణేష్, మురళి, రమేష్, నాగమణి, గంగారం పాల్గొన్నారు.



హాజరైన ప్రజలు

పాఠశాలను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు రవికాంత్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ కె రవికాంత్, జిల్లా సెక్టోరియల్ అధికారి సీఎంవో శ్రీనివాస రావు ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న మన ఊరు - మనబడి పనులను పరిశీలించి పనుల తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు సరఫరా చేసిన దుస్తులలో ఏదైనా లోపాలు ఉంటే వాటిని తిరిగి ఇవ్వాలని తెలిపినట్లు ప్రధానోపాధ్యాయులు సంతోష్ కుమార్ తెలిపారు. ఇదే కాకుండా విద్యార్థుల సంఖ్య, పాఠ్య పుస్తకాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలను అన్ని హంగులతో సరికొత్తగా ఏర్పాటు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

మైనార్టీ రెసిడెన్షియల్ గురుకులంలో ఇంటర్ ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ జయరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 14 ఖాళీలు ఉన్నాయని అదేవిధంగా బైపీసీలు 13 ఖాళీలు ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చౌటుప్పల్ ఏసీపీకి ఖండేభల్లూర్ వాసుల సన్మానం



ఏసీపీగా పదోన్నతి పొందిన మొగులయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-జుక్కల్

చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్యను జుక్కల్ మండలం ఖండేభల్లూర్ గ్రామస్తులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శివరాజ్ దేశాయి మాట్లాడుతు ఖండేభల్లూర్ స్వగ్రామానికి చెందిన మొగులయ్య ఎస్సైగా ఉద్యోగం ప్రారంభించి అంచెలంచేలుగా ఉద్యోగంలో కష్టపడి సిఐగా అనంతరం చౌటుప్పల్ ఏసీపీగా పదోన్నతి పొందారని తెలిపారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఏసీపీ పదవిబాధ్యతలు తీసుకోవడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామం నుండి పెద్దఎత్తున పెద్దలు చౌటుప్పల్ ఎసిపి కార్యాలయానికి చేరుకుని మొగులయ్యను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శివరాజ్ దేశాయి , మాజీ సర్పంచ్ మ్యెయిన్, కృష్ణ రెడ్డి, కొమ్మ హన్మండ్లు, సాయులు, తదితరులు పాల్గొన్నారు.

21 ప్యాకేజీ పనులు రద్దు చేయండి

- కలెక్టర్‌ను కలిసిన మంచిప్ప రీ డిజైన్ పోరాట కమిటీ



కలెక్టర్‌కు వచ్చిన వినతిపత్రం చూపుతున్న ముంపు బాధిత కమిటీ నాయకులు

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామ కమిటీ సభ్యులు సోమవారం ప్రజావాణీలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 21వ ప్యాకేజీ రద్దు చేసే విధంగా జీవో ప్రకటించేలా ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లాలని కలెక్టర్‌ను కోరినట్టు బాధితులు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సొరంగా మార్గం తవ్వినప్పుడు బయటకు వచ్చిన రాళ్లగుట్టను కొందరు ప్రైవేట్ కాంట్రాక్టర్లు అక్రమంగా రాత్రిపూట పెద్ద టిప్పర్లలో తరలిస్తున్నారని వారి మీద చర్యలు తీసుకోవాలని రాళ్లగుట్ట మీద పూర్తి అధికారాలు హక్కులు మంచిప్ప గ్రామానికి ఉండేలా చూడాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.

పోరాట కమిటీ సభ్యుడు రాజేష్ మాట్లాడుతూ ఎన్నిసార్లు కలెక్టర్ ఆఫీస్ చుట్టూ తిరిగినా, ఎంతమంది ప్రజాప్రతినిదులను కలిసిన తమ న్యాయం మాత్రం జరగటం లేదని, ఇప్పటికి చాలామంది కలెక్టర్లను కలిసామని కనీసం మీరైనా మాకు దారి చూపాలని రీడిజన్ రద్దు చేసే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించాలని, తమ బతుకులను తమ పిల్లల జీవితాలను ఆగం కాకుండా సరియైన న్యాయం చేయాలని ఎన్నో సంవత్సరాల నుండి గ్రామాన్ని అంటిపెట్టుకొని ఉన్నామని మమ్మల్ని గ్రామం నుండి విడదీయకుండా మా బ్రతుకులు ఆగం కాకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్ ,నవీన్, సత్యనారాయణ, భాస్కర్ ,మహేష్ ,తదితరులు పాల్గొనడం జరిగింది

భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలి

- రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న వారిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల శివారుగుండా బైపాస్ రోడ్డును నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వం బైపాస్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని కోరుతూ సోమవారం సాలూర మండలానికి చెందిన రైతులు అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు అల్లె రమేష్ మాట్లాడుతూ బైపాస్ రహదారి నిర్మాణంలో సాలుర గ్రామానికి చెందిన చాలామంది రైతులు తమ భూములను కోల్పోయామని తెలిపారు. అట్టి భూములకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చి 5, 6 నెలలు గడిచిన ఇప్పటికీ నష్టపరిహారం అందించలేదని అన్నారు. దాంతో గత రబీ సీజన్లో సైతం పంటలు వేసుకోలేక రైతులు తీవ్రంగా నష్టపోయారని తన ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మెల్యే తక్షణమే స్పందించి వారం రోజులలో బైపాస్ రోడ్‌లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం డబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. లేనియెడల బైపాస్ రోడ్డుని తొలగించి భూములు సాగు చేసుకుంటామని హెచ్చరించారు. ఈ రాస్తారోకో వలన ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న బోధన్ రూరల్ ఎస్సై సందీప్ ఘటన స్థలానికి చేరుకుని రైతులను అదుపులోకి తీసుకున్నారు. అక్కడికి ఆర్డీఓ రాజేశ్వర్ హాజరై రైతులకు సమాధానం చెప్పడంతో వారు శాంతించారు. ఈ రాస్తారోకోలో రైతులు నాగరాజు, ఖదీర్, శంకర్, ఎల్మ శివయ్య, ఉల్లిగడ్డ లక్ష్మణ్, ఇల్తెపు గంగారం, సురేష్ పటేల్, ఖండెల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళ సంక్షేమ దినోత్సవం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా నేడు(మంగళవారం) ఉదయం 10 ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మహిళ సంక్షేమ దినోత్సవం ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సి డి పి ఓ పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జాజల సురేందర్ వస్తున్నారని మహిళలు ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నిత్యవ్యాయామం.. ఆరోగ్యకరం

- 2కే రన్‌లో విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రతి ఒక్కరు ఉదయం నడక అలవాటు చేసుకోవాలని, యోగ, వ్యాయామం చేయడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయనివిప్ గంపగోవర్ధన్ తెలిపారు. 2 కే రన్ కు కామారెడ్డి జిల్లా కేంద్రంలో అపూర్వ స్పందన లభించిందని చెప్పారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2 కే రన్ ముగింపు సమావేశం ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గోవర్ధన్ మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణకు పరుగు దోహదపడుతుందని తెలిపారు. ఈ రన్‌లో చిన్నారులు, యువకులు, వృద్ధులు ఆసక్తిగా పాల్గొన్నారని తెలిపారు. ఆదివారం కళాభారతిలో చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు సాహిత్య దినోత్సవం ప్రత్యేకతను తెలియజేశాయని చెప్పారు. రూ. ఆరు కోట్లతో కళాభారతి ఆడిటోరియం నిర్మించినందుకు దానికి ప్రయోజనం చేకూరిందని అన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి 9 గంటల వరకు కొనసాగాయని తెలిపారు. కామారెడ్డి పట్టణానికి చెందిన ప్రతాప్ కామారెడ్డి కళాక్షేత్రంలో శాస్త్రీయ నృత్యాలు చిన్నారులకు నేర్పించి కామారెడ్డి జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చారని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తొమ్మిదేళ్లలో జిల్లా అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించిందని, వాటి విజయ గాధలను ప్రజలకు తెలియజేయడానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను అభినందించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సమాజంలో పోలీసుల పాత్ర చాలా గొప్పదని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో వారి సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.



కామారెడ్డిలో జెండా ఊపి 2కే రన్ ప్రారంభిస్తున్న విప్ గంపగోవర్ధన్



పరుగులు తీస్తున్న యువత, అధికారులు, ప్రజాప్రతినిధులు

సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, డీఎస్పీ సురేష్, సిఐ నరేష్, పోలీసులు పాల్గొన్నారు.

బిచ్కుంద: తెలంగాణ దశాబ్ది ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా జుక్కల్ నియోజకవర్గం స్థాయి పోలీస్ 2కే రన్ కార్యక్రమాన్ని సోమవారం జుక్కల్ శాసనసభ్యులు హనుమంత్ షిండే జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుండి కొత్త బస్టాండ్, తెలంగాణ చౌరస్తా మీదుగా కమ్మరి గుడి మినీ ట్యాంక్ బండ్ వరకు టూ కే రన్ కొనసాగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పోరాడి సాధించుకున్న రాష్ట్రమని నాటి ఉద్యమపార్టే తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించుకోవడం చారిత్రాత్మకమన్నారు. ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రి అయితే అభివృద్ధి సంక్షేమ పథకాలకు కొదవ ఉండదన్న విషయం తెలంగాణ రాష్ట్రంలో స్పష్టం అవుతుందని గుర్తు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పి ఉదయ్ కృష్ణ, బిచ్కుంద సీఐ కృష్ణ, ఎస్ఐ శ్రీధర్ రెడ్డి, ఎంపీపీ అశోక్ పటేల్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు శ్రీహరి రాజు, సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలాజీ, బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయి, పుల్కల్ సొసైటీ చైర్మన్ రామ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజు పటేల్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బసవరాజ్ పటేల్, పెద్దకోడప్‌గల్, మద్నూర్, జుక్కల్, పిట్లం, నిజాంసాగర్, మండలాల ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

నిత్య వ్యాయామం.. ఆరోగ్యానికి మేలు

2కే రన్‌లో ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ రన్ కార్యక్రమాన్ని ఎల్లారెడ్డి శాసనభ్యుడు జాజుల సురేందర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మండల కేంద్రంలోని అంబెద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే జాజుల సురేందర్ అంబెద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తెలంగాణ రన్‌లో పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తా నుండి ఎల్లారెడ్డి బస్టాండ్, గాంధీచౌక్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజల సురేందర్ మాట్లాడుతూ నిత్య వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని యువకులు ఫిట్‌నెస్‌గా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీను నాయక్, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఎల్లారెడ్డి డిఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, జడ్పీటీసీ ఉష గౌడ్, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్, వివిధ మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ మండలాల పోలీస్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు పాల్గొన్నారు.

2కె రన్ లో పాల్గొన్న ఎంపీపీ దశరథ్ రెడ్డి

రామారెడ్డి: జిల్లా కేంద్రంలో సోమవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 2కె రన్ లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తో పాటు మండల ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి, మండల బి ఆర్ ఎస్ యూత్ అధ్యక్షులు గడ్డం రవీందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సలావత్ బుచ్చిరెడ్డి, పోతుల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుంద:



రామారెడ్డి:



ఎల్లారెడ్డి:

పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ

నవతెలంగాణఎల్లారెడ్డి/గాంధారి/రామారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని మత్తామాల పాఠశాలలో ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఎల్లారెడ్డి మండలంలోని కొట్టాల్ ఎంపిపిఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో



రామారెడ్డిలో



గాంధారిలో

గాంధారి: గాంధారి మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపా ధ్యాయులకు మండల విద్యాధికారి సేవుల స్కూల్ యూనిఫామ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏంఈవో సేవుల సర్వ శిక్ష అభియాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం సోమవారం పునర్ ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న పాఠ్యపుస్తకాలు, మండలానికి చెందిన 17000 మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రానికి చేరుకున్నాయి. కార్యక్రమంలో సీఆర్పీ మహమ్మద్, సురేఖ, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లల్లోనే నాణ్యమైన విద్య

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా పాఠశాలలకు సోమవారం విద్యా వనరుల కేంద్రంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఎంపీపీ గరీబున్నీసా నయీం, గ్రామ సర్పంచ్ బొల్లు లావణ్య చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలు అందజేసినట్టు మండల విద్యాధికారి రామస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఉంపీపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలతో పాటు సన్న బియ్యంతో భోజనం పెడుతున్నట్టు తెలిపారు. ఇటీవల పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులే 10/10 గ్రేడ్ సంపాదించారని గుర్తు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పర్మళ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, సీఆర్పీలు గంగాధర్, విజయ్, రాజు, సత్యనారాయణ, సంజీవ్ ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-జుక్కల్

1994-95వ బ్యాచ్‌కు సంబంధించిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జుక్కల్ కేంద్రంలోని పాఠశాలలో నిర్వహించారు. విద్య నెర్పిన ఉపాధ్యాయులను వరకూమార్, వేణు గోపాల్, రాజేశ్వర్ ప్రత్యేకంగా ఆహ్వానించి శాలువలతో సన్మానించారు. పూర్వ విద్యార్థుల ఒకే చోట కలిసి పిల్ల పాపలతో కలిసి రావడంతో ఒకరికొకరు గత స్మృతులను చర్చించుకున్నారు. వివిధ హెూదాలో ఉన్న వారందరు తమ ఉద్యోగ రీత్య జీవితం ఎలా ఉన్నాయి? వ్యాపారస్తులగా స్థిరపడ్డవారు, రైతుగా మారిన వారి అనుభవాలను ఒకరికొకరు తెలుసుకొని సరదాగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జిల్లాపరిషత్ హెచ్ఎం బస్వంత్, కార్యక్రమం సూపర్ వైజింగ్ చేసి అందరిని ఒకేవేదికపైన సమ్మేళనం ఏర్పాట్లు చేసిన ఒకతాటిపైన తెచ్చిన మాదప్పా, అజార్, లక్ష్మన్, దామ్మోదర్, బస్వరాజ్, స్వరూప, అర్చన, అభినందించారు , ధనలక్ష్మీ, శోభ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-దోమకొండ

రాష్టంలో గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. దోమకొండ మండల కేంద్రంలో చాముండేశ్వరి అమ్మవారి దేవాలయానికి గోపురానికి శంకుస్థాపన, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తో పాటు, ముత్యంపేట్ గ్రామంలో ని నూతన 40 లక్షలతో గ్రామపంచాయతీ కార్యాలయం తో పాటు 40 లక్షల తో చేపట్టిన సిసి రోడ్లు,20 లక్షల రూపాయల పాఠశాలల అదనపు గదులు 3 కోట్ల 60 లక్షల తో ముత్యంపేట నుండి పాల్వంచ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ గంప గోవర్ధన్ మాట్లాడుతు రాష్టంలో సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. రాష్ట్రము ఏర్పాటు తర్వాత గ్రామాలలో సీసీ రోడ్లు గ్రామపంచాయతీ భవనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంకే ముజ్జిబుద్దిన్, సిడిసి చైర్మన్ ఐరన్ నరసయ్య , ఎంపీపీ శారద, జడ్పిటిసి తిరుమల గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు గంధ్ర మధుసూదన్ రావు , సర్పంచులు అంజలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ముత్యంపేట్ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విప్

రేపు వైద్యారోగ్య దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ఈనెల 14 న నియోజకవర్గ కేంద్రాలలో తెలంగాణ వైద్య, ఆరోగ్య దినోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వైద్య శాఖ అధికారులతో వైద్య ఆరోగ్య దినోత్సవం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేల సహకారంతో వేడుకలు విజయవంతమయ్యే విధంగా చూడాలన్నారు. సంక్షేమ ఫలాలు అందుకున్న లబ్ధిదారులు వేడుకలు హాజరయ్యే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, డాక్టర్లకు సన్మానం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర వైద్య విదాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ,జిల్లా వైద్యాధికారి లక్ష్మన్ సింగ్, కామారెడ్డి, బాన్సువాడ ఆస్పత్రి సూపరిండెంట్ విజయలక్ష్మి, శ్రీనివాస ప్రసాద్, వైద్యుడు సంగీత్ కుమార్, చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

కర్నాటక డిప్యూటీ సీఎంకు సన్మానం

నవతెలంగాణ-గాంధారి

కర్నాటక పీసీసీ ప్రెసిడెంట్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను గాంధారి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సర్దార్ నాయక్ బెంగళూర్‌లోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం సాధించి పెట్టినందుకు శాలువతో సన్మానించారు.



శివకుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

బోధన్ అసెంబ్లీ మహిళా మోర్చా కన్వీనర్‌గా రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ నియోజకవర్గం మహిళా మోర్చా కన్వీనర్‌గా మండలంలోని జంలం సర్పంచ్ గొడుగు రాజ్యలక్ష్మి హనుమంతు నియామకమయ్యారు. మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సులోచన, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు ప్రవళిక శ్రీధర్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్రవంతిరెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలను అందుకున్నారు.



నియామకపత్రం అందుకుంటున్న రాజ్యలక్ష్మి

బదిలీపై వెళ్తున్న పోలీసులకు సన్మానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గత 5 సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్‌లు సురేష్, చిన్నయ్య, చంద్రశేఖర్, ఆనంద్‌గౌడ్‌ను పోలీసుస్టేషన్ ప్రాంగణంలో సోమవారం బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస రాజ్, ఎస్ఐ సందీప్ వారికి శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పోలీసులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రతి గ్రామంలో అభివృద్ధి

- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ప్రతి గ్రామంలో అభివృద్ధి చేపడుతున్నామని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఇందల్‌వాయి మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన కుల సంఘాలు, పలు అలయాల ప్రహరీల కోసం మంజూరైన ఎస్‌డీఎఫ్ రూ.62.75 లక్షల విలువ గల ప్రోసీడింగ్ పత్రాలను సోమవారం ఇందల్‌వాయి మండల పరిషత్ కార్యాలయంలో ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వివిధ కులాల సంఘ సభ్యులకు, ప్రజాప్రతినిధులకు జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్‌లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని కులాలు వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు.

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 44 కోట్లు ఎస్‌డీఎఫ్, సీడీపీ నిధులతో చాలావరకు కమ్యూనిటీ హాళ్లను నిర్మించుకున్నామని తెలిపారు. ఇంకా అవసరం ఉన్న చోట జరుగుతున్నాయని వివరించారు. ప్రతి గ్రామంలో ఇప్పటివరకు రూ.25 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం జరిగాయని ఇప్పటికీ ఇంకా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, వైస్ ఎంపీపీ బుసని అంజయ్య, బీఆర్ఎస్ ఇందల్‌వాయి మండల అధ్యక్షులు చిలివేరి దాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు లోలం సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు పాశంకుమార్, లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్, మహిళ విభాగం మండల అధ్యక్షులు పులి వసంత సాగర్, తహసీల్దార్ టీవీ రోజా, ఎంపీడీఓ రాములు నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రొసిడింగ్ కాపీలను అందజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

చౌట్‌పల్లిలో రూ.63లక్షలతో మన ఊరు మనబడి పనులు


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.63లక్షలతో చేపట్టనున్న మన ఊరు-మనబడి పనులను సర్పంచ్ మారు శంకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కృషితో పాఠశాలకు రూ.63 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఇట్టి నిధులు పాఠశాలలో డైనింగ్ హాల్, ఎలక్ట్రికల్ వర్క్స్, తాగునీటి వసతి, మేజర్, మైనర్ రిపేర్లకు మంజూరైనట్టు తెలిపారు. మన ఊరు మనబడి పనులకు త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పాఠశాలకు నిధులు మంజూరు చేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పాఠశాల తరఫున, గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కుంట ప్రతాప్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ రాగ సుధా, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రాజేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నవీన్‌గౌడ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దుల గుట్టపై ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ ఇంచార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం సిద్దుల గుట్టపై నెలకొన్న స్వయంభూ శివలింగం వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్-కౌన్సిలర్ సంగీతా ఖాందేష్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వన్నెలదేవి లత, బీఆర్ఎస్ నాయకులు వన్నెలదేవి రాము, మీరా శ్రావణ్, ఖాందేష్ సత్యం, అభిలాష్, చింటూ, మురళి కృష్ణ, నరేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 71 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 71 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, ట్రెయినీ అదనపు కలెక్టర్ కిరణ్మయి, డీఆర్డీఓ చందర్, ఆర్డీఓ రవిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

15 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

మద్యం సేవించి ఆదివారం వాహనాలు నడుపుతున్న 15 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. ఈ మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 30 మందిపై కూడా కేసులు నమోదు చేసుకొని 30 మందికి సోమవారం నగరంలోని జిల్లా టీటీఐ కౌన్సెలింగ్ సెంటర్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాజేశ్వర్‌గౌడ్, ఆర్ఎస్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగి అండగా నిలవాలి

- అధ్యక్షురాలు రాజమణి
- ఘనంగా ఇంటి దీపం ప్రొడ్యూసర్స్ పరస్పర సహాయ సహకార సంఘ 22వ మహా జనసభ


మాట్లాడుతున్న రాజమణి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహిళలు ఆర్థికంగా ఎదిగి, తమ కుటుంబానికి అండగా నిలవాలని అధ్యక్షురాలు రాజమణి పేర్కొన్నారు. డిచ్‌పల్లి ఇంటి దీపం ప్రొడ్యూసర్స్ పరస్పర సహాయ సహకార సంఘం 22వ వార్షిక మహాజన సభను మండల కేంద్రంలోని ఘన్పూర్ గ్రామంలోని ఇస్లాంపుర ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించారు. నూతన అధ్యక్షులను డైరెక్టర్లు ఎన్నుకున్నారు. అనంతరం ఓవర్ డ్యూ లేకుండా అప్పులు చెల్లించిన సభ్యులకు ఘనంగా సన్మానించి కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమం బంగ్లా రాజమణి అధ్యక్షతన ఈ మహాజనసభ నిర్వహించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి, తమ కుటుంబానికి అండగా నిలవాలని అధ్యక్షురాలు రాజమణి పేర్కొన్నారు. వార్షిక నివేదికలో డిచ్‌పల్లి ఇంటి దీపంలో 1650 మంది సభ్యత్వం కలిగి ఉన్నారని, వీరి వాటాధనం రూ.73,14,790, రిజర్వు నిధులు రూ.37,46,667, మొత్తం సొంత నిధులు,1,10,61,458 ఉన్నట్టు వివరించారు. మొత్తం సభ్యులపై అప్పులు 912 మందిపైన 90,60, 017 లక్షలు ఉన్నట్టు మేనేజర్ సర్వోన్నతరావు సభ్యులకు చదివి వినిపించారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

వనపర్తిలో డిసెంబర్ 2022 2,3,4తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి జూనియర్ పురుషుల హాకీ జట్టుకు ఎంపికైనట్టు నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ సోమవారం తెలియజేశారు. వీరు జూన్ 12 నుంచి 22వ 2023, రావుర్కెల ఒరిస్సా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి జూనియర్ పురుషుల పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిని కాకుండా అంతర్జాతీయ స్థాయి వరకు చేరుకోవాలని వారిని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా హాకీ సంఘం అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, హాకీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి పింజ సురేందర్, ఉపాధ్యక్షులు విద్య సాగర్‌రెడ్డి, నరసింహారెడ్డి, హనుమంతు, రిటైర్డ్ హాకీ కోచ్ హర్షవర్ధన్‌రెడ్డి, మక్బూల్ (హాకీ కోచ్), సంయుక్త కార్యదర్శులు ఎండీ జావిద్ (హాకీ కోచ్), ఎండీ ఆరిఫ్, చిన్నయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి అంజు, ఈసీ మెంబర్ సంతోష్, నాగేష్, సుధీర్, కత్తి శ్రీనివాస్, రాహుల్, నవనీత్, సీనియర్ క్రీడాకారులు జిమ్మీ రవి అభినందించారు.


ఎంపికైన క్రీడాకారులు

పిల్లల భవిష్యత్తును గాలికి వదిలేసి దశాబ్ది సంబరాలు

- కోటగల్లీ బాలికల పాఠశాల వద్ద ధర్నా
- సమస్యలు పరిష్కరించకుండా విద్యార్థులను బడికి రమ్మంటారా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వం పిల్లల భవిష్యత్తును గాలికి వదిలేసి దశాబ్ది సంబరాలు చేస్తుందని పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ నాయకులు జన్నారపు రాజేశ్వర్, వరద బట్టు వేణురాజ్ అన్నారు. సోమవారం నగరంలోని కోటగల్లి ప్రభుత్వ బాలిక పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేపట్టి.. మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుండానే విద్యార్థులను బడికి రమ్మంటారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మన ఊరు మనబడి అనే పథకాన్ని ప్రారంభించి దానికి ప్రచార ఆర్భాటాలు చేయడమే తప్ప ఆ పథకం ద్వారా పాఠశాలలో అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. ఈ విద్యా సంవత్సరం ఆరంభంలో కొత్త ఉత్సాహంతో బడికి వెళ్లాలనుకునే విద్యార్థులకు ప్రతి ఏటా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని, తలుపులు లేని తరగతి గదులు, పెచ్చులూడుతున్న పైకప్పులు, నీటి వసతులు లేని మరుగుదొడ్లు, నెర్రలు వారిన తరగతి గోడలు, శిథిలావస్థకు చేరుకున్న సర్కార్ బడుల భవనాలను మరమ్మతులు చేయకుండానే తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్, నిఖిల్, విజయ్, దుర్గాప్రసాద్, రజినీకాంత్, వివేక్ గంగాధర్, సయ్యద్ అష్రఫ్, శివ, సందీప్‌రెడ్డి, శివ కుమార్, విష్ణు, సాగర్, లోకేష్, సూరజ్, రంజిత్, నాని, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి పోరాడాల్సిందే

- సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి గత పది సంవత్సరాల కాలంగా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మళ్లీ ఎన్నికలకు వెళ్లి అధికారం కోసం పాకులాడుతున్నారని అన్నారు. సంబంధవర్గాల వారికి ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మారాయని, అధికారికమే లక్ష్యంగా ప్రజలను పక్కదారి పట్టిస్తూ మతం, కులం పేరుతో ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని అన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన ప్రజా సమస్యలు పరిష్కారం చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని, కమ్యూనిస్టు ఉద్యమాల వల్లనే ప్రజా సమస్యల పరిష్కారం అవుతున్నాయని అన్నారు. భవిష్యత్ కాలంలో సీపీఐ పార్టీ ప్రజా, రైతాంగ, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలతో పాటు పార్లమెంట్, శాసనసభ చట్టసభలోకి వెళ్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు వై.ఓమయ్య, నాయకులు నల్లగంగాధర్, కిష్టయ్య, శంకర్, ఎం.సాయిలు, జీ.రమేష్, వెంకటేష్, రాములు, రాధాకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.సుధాకర్

అంతుచూస్తామని బెదిరిస్తున్నారు..

- కలెక్టరేట్‌కు వచ్చిన మహిళలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కొందరు రియలేస్టేట్ వ్యాపారులు తమ భూమిని కబ్జా చేసుకునేందుకు తమ అంతుచూస్తామని బెదిరిస్తున్నారని నందిపేట్ మండలంలోని చింరాజ్‌పల్లి గ్రామానికి చెందిన మహిళలు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2005లో అప్పటి ప్రభుత్వం రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే నెంబర్ 40/7/1లో 121 గజాల స్థల విస్తీర్ణంలో చింరాజ్‌పల్లి గ్రామంలో ఆర్డియస్ నెంబర్ 02/4618/02 ప్లాట్ నెంబర్ 9ను ఇచ్చారని, ఆ స్థలంలో గుడిసె వేసుకొని కుటుంబంతో సహా జీవించామని, గతంలో విపరీతంగా ఈదురు గాలులు, వర్షాలు కురియడంతో తమ గుడిసె కూలిపోయిందని తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం రేకులతో కూడిన ఇల్లు కట్టుకోవడానికి ఆ స్థలానికి వెళ్తే.. ఆ స్థలాన్ని ఇతరులు కబ్జా చేసుకోవాలని చూస్తున్నారని, తమను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


వినతిపత్రాలను చూపుతున్న బాధితులు

చందూర్‌లో గంగమ్మ ఆలయ వార్షికోత్సవాలు

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండల కేంద్రంలో భోగి సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే గంగమ్మ తల్లి వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో మంజూరైన కుల సంఘ భవనం చందూర్ లిఫ్ట్ ద్వారా పెద్ద చెరువు, బతుకమ్మ చెరువు నిండితే అధికంగా లాభపడేది బోయి కుల సోదరులేనని తెలిపారు. కార్యక్రమంలో బోయి కుల సంఘం అధ్యక్షుడు మోస్రా పోశెట్టి, కార్యవర్గ సభ్యులు బర్ల లక్ష్మణ్, సాయిలు, చింతకింది సాయిలు, లక్ష్మయ్య, చిన్న సాయిలు, చింతకింది చిన్న సాయిలు, మోస్రా గంగాధర్, దొబ్బోల్ల శంకర్, సాయిలు, పోశెట్టి, నర్సయ్య, పెద్ద సాయిలు, పెద్దలు జయరాం, కెరయ్య, బోయి కుల సంఘ పెద్దలు, యువకులు మహిళాలు తదితరులు పాల్గొన్నారు.


వార్షికోత్సవ వేడుకల్లో పలువురు

మినరల్ వాటర్ ప్లాంట్లపై తనిఖీలు చేపట్టాలి

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వెలుస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్‌లపై సంబంధిత అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టాలని సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు సాయిబాబు, శివకుమార్‌లతో కలిసి సోమవారం వర్ని తహసీల్దార్ విఠల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటిని శుద్ధి చేసే యంత్రం నాణ్యత లేకపోతే ప్రజలు రోగాల బారిన పడే ఆస్కారం ఉంటుందన్నారు. శుద్ధి చేసిన స్వచ్ఛమైన మంచినీటి పేరుతో దోపిడీ చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'ఆరోగ్య తెలంగాణ' సమావేశం


అధికారులతో డీఎంఅండ్‌హెచ్‌వో సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ వైద్య విధాన పరిషద్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 14న జరగబోయే ఆరోగ్య తెలంగాణ కార్యక్రమంపై డీఎంఅండ్‌హెచ్‌వో సుదర్శన్, వైద్యులు శివశంకర్ సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగరాజు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయానికి బీసీ చేతి, కులవృత్తి దారులు దరఖాస్తులు చేసుకోవాలి

- ఎంపీపీ బుద్దె సావిత్రి



నవతెలంగాణ-బోధన్

తెలంగాణ ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం బీసీ కుల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం మంజూరి చేస్తున్నందున అర్హులైన బీసీ కులాల వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ సోమవారం పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో ఉన్న కుల వృతులకు స్వయం ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నందున అర్హులైన వారు ఈ నెల 20 తేదీ వరకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నాయిబ్రాహ్మణ, రజక, సాగర ఉప్పర, కుమ్మరి/శాలివాహన, అవుసుల, కంసాలి, కమ్మరి, కుంచరీ, వడ్ల/వడ్రంగి శిల్పిస్, క్రిష్ణ బలిజ పూసల, వడ్డెర, ఆరెకటికే, మేర, మేదరి, ఎంబీసీకి చెందిన వృత్తుల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ కోరారు. ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న జిరాక్స్ పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందచేయాలని కోరారు.

అర్సపల్లిలో ప్రజాకళామండలి ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న కళామండలి సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ప్రజా కళా మండలి ఆత్మీయ సమ్మేళనాన్ని అర్సపల్లిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాయక్‌వాడి నర్సయ్య మాట్లాడుతూ.. 50 సంవత్సరాల కాలంగా ప్రజలు ఉద్యమంలో పాల్గొనేందుకు కళా మండలి ఊపిరి పోసిందని అన్నారు. అలాగే ప్రజా కళా మండలి అధ్యక్షులు షహీద్ మియా తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిర్ప నాగయ్య, షహీద్, సిర్పలింగం, హన్మండ్లు, బట్టి గంగాధర్, బాపి ఎల్లయ్య, అమర కళాకారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కస్తూర్బాకు వంట మనిషి కావలెను

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు వంట మనిషి కావాలని ప్రిన్సిపాల్ స్వప్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళలు ఏడవ తరగతి చదువుకున్న వారు ఈనెల 16వ తేదీ సాయంత్రం లోపు కస్తూర్బా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.